# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ గురువారం 23-5-2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 312

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




సోరెస్ బెయిల్ పిటిషన్ తిరస్కరించిన సుప్రీం



2లో

## మళ్లీ కరెంట్ కోతలు.. ఇన్వర్‌ట్ల మోతలు

విద్యుత్ సబ్ స్టేషన్ల ముట్టడి..ట్రాన్స్‌ఫార్మర్ల పేలుళ్లు

ఆరు నెలల్లోనే ఆరుదశాబ్దాలు దౌర్భాగ్యం

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ట్వీట్



2లో

## మారిన టిఎస్ ఆర్టీసీ పేరు ఇకనుంచి టిజిఎస్ ఆర్టీసీగా మార్పు

## ధాన్యం కొనుగోళ్లలో ఎందుకీ తిరకాసు



3లో

తక్షణ కొనుగోళ్లతో రైతులకు ఊరట కల్పించాలి

ఇస్తామన్న బోనస్ ఇచ్చి చిత్తశుద్ది చాటుకోవాలి

నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్

# అన్ని రకాల వడ్లకు 500 బోనస్ ఇవ్వాలి

మంత్రివర్గ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి

దొడ్డు వడ్లకూ బోనస్ ఇచ్చేలా పోరాడతాం: హరీశ్



హైదరాబాద్: కేవలం సన్న వడ్లకే బోనస్ ఇస్తామనే రాష్ట్ర మంత్రివర్గ నిర్ణుయాన్ని పునఃసమీక్షించుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా వానాకాలం నుంచి అన్ని రకాల వడ్లకు క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ ఇవ్వాలన్నారు. దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇచ్చేలా బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. వరి ధాన్యానికి బోనస్ చెల్లింపు అంశంపై రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంపై హరీశ్‌రావు మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. వరి ధాన్యానికి బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ముఖ్య నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క కూడా హామీ ఇచ్చిన విషయాన్ని హరీశ్‌రావు గుర్తు చేశారు. సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం మోసానికి పరాకాష్టగా పేర్కొన్నారు. యాసంగిలో సాగు చేయని సన్నవడ్లకు బోనస్ ప్రకటించడం రైతుల నోట్లో మట్టికొట్టడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. వానాకాలంలో 20 శాతం మాత్రమే సన్నరకం సాగు చేస్తారని, యాసంగిలో 99 శాతం దొడ్డు వడ్లు సాగు చేస్తారన్నారు.

**'భరోసా'రూ.5 వేలేనా?**

రాష్ట్రంలో దిగుబడి వచ్చే 1.20 కోట్ల మెట్రిక్ టన్నుల వరి ధాన్యానికి బోనస్ ఇచ్చేందుకు

రూ.6 వేల కోట్లు అవసరమవుతాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. అయితే కేవలం సన్న రకం వడ్లకే బోనస్ ఇచ్చేందుకు రూ.500 కోట్లు సరిపోతాయని, దీనితో రూ.5,500 కోట్లు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు.

## బోనస్‌తో వడ్లు కొనేందుకు ఎందుకు జాప్యం

ఇచ్చిన హామీ మేరకు అన్ని రకాల వడ్లు కొనాల్సిందే

ధాన్యం సేకరణకు కేంద్రం సిద్దంగా ఉంది

మీడియాతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



2లో

## బిఆర్ఎస్ ప్రభుత్వం కన్నా మెరుగ్గా కొనుగోళ్లు

ఆనాడు వరికుప్పలపైనే రైతులు ప్రాణాలు వదిలారు

ఇప్పుడు ధైర్యంగా పంటలు అమ్ముకుంటున్నారు

సన్న ధాన్యం ప్రోత్సాహం కోసమే 500 బోనస్

ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోళ్లు లేకుండా రైతులకు మద్దతు

బిఆర్ఎస్ అబద్దాలు ప్రచారం మానాలి

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి

2లో



## తెలంగాణలో మరో మూడు రోజులు వర్షాలు

**హైదరాబాద్:** తెలంగాణలో మరో మూడురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 23న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. 24న జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. 25న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది.





## బోల్తాపడ్డ మద్యం బాటిళ్ల లారీ

బాటిళ్లు తీసుకెళ్లే ప్రయత్నాలకు పోలీసుల బ్రేక్

**హైదరాబాద్:** మద్యం బాటిళ్లతో వెళుతోన్న లారీ హైదరాబాద్ బోయిన్ పల్లి వద్ద బోల్తా పడింది. మద్యం బాటిళ్లు చెల్లాచెదురుగా అక్కడ పడిపోయాయి. వాటిని చూసిన కొందరు తీసుకెళ్లేందుకు గుమికూడారు. లారీ బోల్తా పడిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకోవడంతో వారి ప్రయత్నం ఫలించలేదు. లారీ డ్రైవర్, క్లీనర్, వైన్ షాప్ సిబ్బంది కూడా వచ్చారు. మరో వ్యాన్‌లో లిక్కర్ బాటిళ్లను తరలించారు. పోలీసులు బ్యారికేడ్లు ఏర్పాటు చేయడంతో బాటిళ్లు తీసుకెళ్లడం వీలు పడలేదు. లేదంటే ఆ మందు బాటిళ్లు మొత్తం మాయం చేసేవారు. ఆ లారీ బోల్తాకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో షేర్ చేయడంతో తెగ చక్కర్లు కొడుతున్నాయి.

## కొత్త ప్రభుత్వానికి రూ.2.11 లక్షల కోట్లు

**ఎన్నికల అనంతరం ఏర్పడే కొత్త ప్రభుత్వానికి సాంత్వన చేకూరే ఆర్థిక నిర్ణయాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రకటించింది. గతంలో ఎన్నడూ లేనంతగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్‌ను ప్రభుత్వానికి చెల్లిస్తామని ప్రకటించింది.**

**డివిడెండ్ రూపంలో చెల్లించేందుకు ఆమోదం తెలిపిన ఆర్‌బీఐ బోర్డు**



**ముంబయి:** ఎన్నికల అనంతరం ఏర్పడే కొత్త ప్రభుత్వానికి సాంత్వన చేకూరే ఆర్థిక నిర్ణయాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రకటించింది. గతంలో ఎన్నడూ లేనంతగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ. 2.11 లక్షల కోట్ల డివిడెండ్‌ను ప్రభుత్వానికి చెల్లిస్తామని ప్రకటించింది. గత ఫిబ్రవరిలో రూపొందించిన 2024-25 తాత్కాలిక బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసిన రూ. 1.02 లక్షల కోట్లకు రెట్టింపు మొత్తాన్ని డివిడెండ్‌గా చెల్లించాలని బుధవారం జరిగిన ఆర్‌బీఐ బోర్డు సమావేశం నిర్ణయించింది. 2022-23కు సంబంధించి, ఆర్‌బీఐ మిగులు నిధుల్లో రూ. 87,416 కోట్లను డివిడెండ్ రూపంలో ప్రభుత్వానికి చెల్లించిన సంగతి విదితమే. 2018-19 ఆర్థిక సంవత్సరానికి రూ. 1.76 లక్షల కోట్ల డివిడెండ్‌ను చెల్లించిన ఆర్‌బీఐ, అంతకుమించి రూ. 2,10,874 కోట్లను చెల్లించేందుకు సిద్ధమైంది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలో జరిగిన ఆర్‌బీఐ డైరెక్టర్ల కేంద్ర బోర్డు 608వ సమావేశంలో దీనికి ఆమోదం తెలిపింది.





# కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పోరాడాలి.

**ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 22:**

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా నూతన నాయకత్వం పోరాడాలనీ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు పిలుపునిచ్చారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో మర్చంట్ అసోసియేషన్ హాల్ నందు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై .ఓ మయ్యు అధ్యక్షతన నూతనంగా ఎన్నికైన హమాలీ యూనియన్ నాయకుల ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు, మార్కెట్ యార్డ్ ఉన్నత శ్రేణి కార్యదర్శి వెంకటేశం హాజరై నూతనంగా ఎన్నికైన నాయకత్వం చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యం ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి కార్మికులు కంకణ బద్దులై పనిచేయాలని అన్నారు. సంవత్సరానికి 10 నెలలు నడిచే వ్యవసాయ మార్కెట్ రెండు నెలలు కూడా నడవకపోవడం శోచనీయమని రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేయాలని, రైతుకు భరోసా కనిపిస్తూ మార్కెట్ యార్డుకు ధాన్యం తీసుకురావడం ద్వారా గిట్టుబాటు ధర రావటంతో పాటు రైతు పండించిన ధాన్యానికి గ్యారెంటీ ఉంటుందనే భరోసాను కల్పించాలని అన్నారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని, అది కార్మికులు, అధికారులు రైతుల సంక్షేమం కోసం ఉపయోగపడుతుందని అన్నారు. ఏఐటీయూసీగా నిరంతరం కార్మికుల సంక్షేమం కోసం పనిచేస్తామని, కార్మికుల లైసెన్సుల పునరుద్ధరణ, 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తింపు, శ్రమకు తగ్గ ప్రతిఫలం, పిఎఫ్ ఈఎస్ఐ గ్రాడ్యుటి చట్టాల అమలు తోపాటు గత ప్రభుత్వ హామీలో భాగంగా కార్మికుల పిల్లల చదువులకు సహకారం అందించడం కోసం ఐక్యమత్యంతో కార్మికులు పనిచేయాలని కోరారు.

మార్కెట్ యార్డ్

కార్యదర్శి వెంకటేశం మాట్లాడుతూ, కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని, మార్కెట్ యార్డుకు చెడ్డ పేరు రాకుండా మీరంతా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మర్చంట్ అసోసియేషన్

అధ్యక్షుడు కమల్ కిషోర్ ఇనాని, కార్యదర్శి మల్లేష్, స్థానిక కార్పొరేటర్లు హమాలీ యూనియన్ నూతన అధ్యక్షులు ఎం. పరుశురాం, కార్యదర్శి శ్రీహరి, ఉపాధ్యక్షులు ఎన్. సుధాకర్, కోశాధికారి టి. నరేష్, నాయకులు కిషన్ గౌడ్, వెంకట్, దడువాయి గుమస్తా సంఘం చాట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కార్మికులు తదితరులు నూతనంగా ఎన్నికైన నాయకులకు ఘనంగా సత్కరించి అభినందించారు.



# మళ్లీ కరెంట్ కోతలు..ఇన్వర్‌ట్ల మోతలు

**హైదరాబాద్:** గత ఆరు దశాబ్దాల కన్నీటి దృశ్యాలు.. 6 నెలల కాంగ్రెస్ పాలనలోనే ఆవిష్కృతమయ్యాయని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్(ట్విటర్) వేదికగా విమర్శించారు. పదేళ్లు లేని కరెంట్ కోతలను మళ్లీ చూస్తున్నామన్నారు. విద్యుత్తు సబ్ స్టేషన్ల ముట్టడి చూస్తున్నట్లు తెలిపారు. మోటార్లు కాలుతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు పేలుతున్నాయని ఎద్దేవా చేశారు. మళ్లీ చాన్నాళ్లకు ఇన్వర్టర్లు, జనరేటర్ల మోతలు చూస్తున్నట్లు చెప్పారు. సాగునీరు పంట పొలాలు ఎండుతున్నాయన్నారు. ట్రాక్టర్లు ఉండాల్సిన పొలంలో ట్యాంకర్లు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. చుక్కనీరు లేక బోసిపోయిన చెరువులు దర్శనమిస్తున్నాయి. పాత అప్పు కట్టాలని రైతులకు నోటీసులు వస్తున్నాయి. రైతుబంధు కోసం నెలలపాటు పడిగాపులు కాయాల్సి వస్తోంది. తడిసిన ధాన్యాన్ని కొనే దిక్కు లేదు. పదేళ్ల తరువాత అన్నదాతల ఆత్మహత్యలు చూస్తున్నాం. విత్తనాల కోసం రైతుల మొక్కులు.. క్యూలైన్ లో పాసుబుక్కులు చూస్తున్నాం. కాంగ్రెస్ పాలనలో ఇలాంటి విషాద దృశ్యాలు ఇంకెన్ని చూడాలో. ఎంజీఎం ఆసుపత్రిలో 5 గంటల విద్యుత్ కోత బాధాకరం. ఆసుపత్రులను కూడా ఈ ప్రభుత్వం నిర్వహించలేకపోతోంది. కరెంటు కోతలు లేవని సీఎం, మంత్రులు పదేపదే అంటున్నారు. ఆసుపత్రుల్లో కరెంట్ కోతలకు ఎవరు బాధ్యత వహిస్తారని కేటీఆర్ ప్రశ్నించారు.

# మారిన టిఎస్ ఆర్టీసీ పేరు ఇకనుంచి టిజిఎస్ ఆర్టీసీగా మార్పు



**హైదరాబాద్:** తెలంగాణ ఆర్టీసీ పేరులో మార్పు చోటుచేసుకుంది. ప్రభుత్వం ఆదేశాల మేరకు మార్పు చేస్తూ నిర్ణయం తీసుకున్నది. ఇప్పటి వరకు టీఎస్ ఆర్టీసీగా కొనసాగగా.. ప్రస్తుతం టీజీఎస్ఆర్టీసీగా మారింది. ఇటీవల ప్రభుత్వం టీఎస్ స్థానంలో టీజీగా మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇక నుంచి నివేదికలు, ప్రభుత్వ ఉత్తర్వులు, లెటర్ హెడ్‌లపై టీఎస్‌కి బదులు టీజీగా పేర్కొనాలని ఆదేశించింది. ఈ మేరకు కేంద్రం అనుమతి ఇస్తూ గెజిట్ జారీ చేసిన విషయం తెలిసిందే. గతంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల బోర్డులు, ప్రభుత్వ పరంగా టీఎస్‌గా రాసే విషయం తెలిసిందే. గతేడాది డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్ స్థానంలో టీజీని మార్పు చేస్తూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. కేంద్రం అనుమతులు జారీ చేసిన విషయం తెలిసిందే. మొదటగా మార్చిలో వాహనాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి టీఎస్ తొలగించి టీజీగా మార్చింది. ఇటీవల ప్రభుత్వ కార్యాలయాల్లోనూ మార్పులు చేయగా.. తాజాగా ఆర్టీసీ సైతం టీజీఎస్ ఆర్టీసీగా మార్పులు చేసింది. సంస్థ ఎండీ సజ్జనార్ సైతం సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు టీఎస్ఆర్టీసీ పేరును టీజీఎస్ఆర్టీసీగా మార్చడం జరిగిందన్నారు.

# బోనస్‌తో వడ్లు కొనేందుకు ఎందుకు జాప్యం

**హైదరాబాద్:** రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ నేతలు రైతులను మోసం చేస్తున్నారని కేంద్ర మంత్రి, భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. డిసెంబర్ 9నే రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి.. ఇప్పుడు ఆగస్టు 15లోగా అమలు చేస్తామని అంటున్నారని ఎద్దేవా చేశారు. సన్న వడ్లకే బోనస్ అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారన్నారు. రాష్ట్రంలో 80 శాతం దొడ్డు వడ్లనే పండిస్తారని చెప్పారు. చాలా తక్కువ మంది రైతులే సన్న రకం పండిస్తారని తెలిపారు. హైదరాబాద్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..దొడ్డు వడ్లను కొనుగోలు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. వాటిని కొనేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమిటన్నారు. ఈ ప్రభుత్వం బోనస్ పేరుతో అన్నదాతలను మోసం చేసింది. కేంద్రం అన్ని రకాలుగా వారికి అండగా ఉంది.

రబీ సీజన్‌లో పెద్ద మొత్తంలో ధాన్యం సేకరించాలని కేంద్రం ఒప్పందం కుదుర్చుకుంది. గతంలో భారాస, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులను మోసం చేస్తున్నాయి. ధాన్యం తడిచి మొలకెత్తుతున్నా, కొనుగోలు కేంద్రాలకు తరలించి వారాలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. మార్కెట్‌యార్డుల వద్ద అన్నదాతలు పడిగాపులు కాస్తున్నారు. మంగళవారం 75 వేల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కొనేందుకు మరో 2 నెలలు పడుతుంది. వర్షాలు పడి ధాన్యం మొలకలు వస్తుంటే బాధ్యులు ఎవరని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. బోనస్ ఇచ్చి కొనడానికి మీకు బాధ ఏంటని కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. తెలంగాణ రైతులను మరో సారి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. వంద రోజుల్లో రుణమాఫీ చేస్తామని చెప్పి రైతుల్ని దగా చేసిందన్నారు. కౌలు రైతులకు 15 వేలు ఇస్తామని చెప్పారు? వరికి క్వింటాల్ కు 500 బోనస్ ఇస్తామని చెప్పి యే ఒకటి కూడా అమలు చేసేలా లేదన్నారు. రైతులను నయవంచన చేసి అధికారం లోకి కాంగ్రెస్ వచ్చిందన్నారు. దేవుడి పేరుతో ఓట్లు పెడుతూ ప్రజలకి మాత్రం పంగనామాలు పెడుతుంది ఈ ప్రభుత్వం అని మండిపడ్డారు. సన్న వడ్లకు మాత్రమే బోనస్ అని సన్నాయి నొక్కులు నొక్కుతుందన్నారు.చెయ్యి గుర్తుకు ఓటు



వేసినందుకు రైతులకు చేయి ఇస్తుంది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎంత ధాన్యం పండిన యే రకం అయినా కేంద్రం కొంటుంది? రైతులకు అండగా కేంద్రం ఉంటుంది? డబ్బులు చెల్లిస్తుందన్నారు. రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెన్నుపోటు పొడుస్తుంది .. దుర్మార్గం అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం మేరకు 22 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఖరీఫ్ సీజన్ ది రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఇవ్వలేదన్నారు. రబీలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ఒప్పందం చేసుకుంటే 33 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించింది ఈ ప్రభుత్వం అన్నారు. అకాల వర్షాలతో ధాన్యం మొలకెత్తిన ? కొనుగోలు మాత్రం నామ మాత్రంగా నత్తనడకన నడుస్తుంది?రైతులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న కోనుగులు చేసింది 75 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే అన్నారు. సోనియమ్మ రాజ్యం అంటే రైతుల కన్నీళ్లు చూడడమా అని మండిపడ్డారు.కేంద్ర ప్రభుత్వం ధాన్యం ఎఫ్‌సిఐకి చేరే వరకు అయ్యే ఖర్చు మొత్తం భరుస్తుంది? రాష్ట్ర ప్రభుత్వం మీద ఒక్క పైసా కూడా భారం కూడా పడదు? ఇంకా కమిషన్ ఇస్తుంది కేంద్రం? కమిషన్ డబ్బులతో నే ఉద్యోగులకు జీతాలు ఇస్తుంది రాష్ట్ర ప్రభుత్వం అన్నారు. దొడ్డు రకం వేస్తే అడ్డుకుంటామని సీఎం అంటున్నారని తెలిపారు. ఇప్పుడు ఎందుకు బోనస్ చెల్లించడం లేదో రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ చెప్పాలన్నారు. మీ గారెంటీలు గారడీలు కాకుంటే తెలంగాణ ఓట్ల మీద మీకు గౌరవం ఉంటే ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఇప్పుడు కళ్ళాలలో ఉన్న దాన్యం కు బోనస్ చెల్లించి కోనాల్సిందే అని డిమాండ్ చేశారు. ధాన్యం మీద కనీస ధర 61 శాతం కేంద్ర ప్రభుత్వం పెంచిందన్నారు. సన్న బియ్యం కి వెయ్యి బోనస్ ఇవ్వాలన్నారు. మిగతా ధాన్యానికి 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఛత్తీస్ ఘడ్ ప్రభుత్వం వెయ్యి రూపాయల బోనస్ ఇస్తుందన్నారు. రుణమాఫి చేయని కారణంగా రైతులు కొత్తగా రుణం తెచ్చుకునే పరిస్థితి లేదన్నారు. ఇప్పుడు రైతులు అప్పులు ఎక్కడ తెచ్చుకోవాలి? రైతు బతుకు ఏంది? అని ప్రశ్నించారు. ఆగస్టు లో రుణమాఫీ చేస్తారనే నమ్మకం లేదన్నారు. ఆగస్టు వరకు వర్షాలు పడకుండా రేవంత్ రెడ్డి ఏమైనా ఆపుతారా? అని వ్యంగాస్త్ర వేశారు. 6 గ్యారంటీల పై సోనియమ్మ సంతకంతో ఇంటింటికి లెటర్ రాసింది కాంగ్రెస్ అన్నారు. భారత దేశాన్ని మోసం చేస్తున్న చరిత్ర కాంగ్రెస్ అని తెలిపారు. కాంగ్రెస్ ఆలోచన గుంట నక్క కన్నా ఎక్కువగా ఉంటుందన్నారు.ఎన్ని తరాలు మారినా కాంగ్రెస్ తీరు మారదన్నారు. 15 వందల తెలంగాణ బిడ్డల

ప్రాణాలు తీసినందుకు సోనియా గాంధీ నీ జూన్ 2 న ఆవిర్భావ దినోత్సవం కు పిలుస్తున్నారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమానికి సోనియా గాంధీ ఎలా వస్తారు? అని మండిపడ్డారు. తెలంగాణను ప్రజలు దంచి తెచ్చుకున్నారు? సోనియా ఇవ్వలేదన్నారు. సోనియా వారసత్వ రాజకీయాలకు నాయకురాలు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రజల పోరాటం చేసి సుష్మ స్వరాజ్ పోరాటం తో తెలంగాణ వచ్చిందన్నారు. మార్కెట్ యార్డు లు విజిట్ చేస్తానని కిషన్ రెడ్డి అన్నారు.


# బిఆర్ఎస్ ప్రభుత్వం కన్నా మెరుగ్గా కొనుగోళ్లు

**హైదరాబాద్:** బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోలిస్తే కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం, ధాన్యం సేకరణ వేయి పాళ్లునయమని, ఇది తెలంగాణ రైతుల అభిప్రాయం అనివ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలియజేసారు. గతంతో పోలిస్తే ముందస్తుగానే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసామని, చురుకుగా కొనుగోళ్లు సాగుతున్నాయని అన్నారు. తెలంగాణలో సన్న వడ్ల సాగును పెంచేందుకు 500 బోనస్ ఇస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణలో దొడ్డు వడ్లు తినడం చాలా తగ్గిపోయింది. గత ప్రభుత్వంలో సన్న బియ్యం పేరుతోటి దొడ్డు వడ్లనే పాలిష్ చేసి అంగన్వాడీలకు, మధ్యాహ్న భోజన పథకానికి వినియోగించేవారు. అలా కాకుండా పేదలు కూడా పెద్దోళ్లు తినే సన్న బియ్యం తినాలనే సంకల్పంతో రేషన్ దుకాణాల్లో కూడా సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని పెట్టుకుంది. కానీ ఇతర రాష్ట్రాల నుంచి సన్నబియాన్ని దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇకపోతే ఐకేపీ సెంటర్ల పెంపు గత ఏడాదితో పోలిస్తే నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేసామని, ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు జిల్లాకొక ఐఏఎస్ ను నియమించి ఎప్పటికప్పుడు సమీక్ష చేయిస్తున్నా మన్నారు. తరుగు, తాలు పేరుతో కోతలు లేవు.. గతంలో ప్రతి క్వింటాకు 7 నుంచి 10 కేజీల వరకు తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ.. ఈ దఫా మిల్లర్ల దోపిడీ పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో కోతలకు మిల్లర్ల స్వస్తి చెప్పారని అన్నారు. దీంతో ప్రతి కింటా పై రైతుకు 150 నుంచి 200 రూపాయల వరకు అదనపు లబ్ది చేకూర్చామన్నారు. రైతులు పంట అమ్ముకున్న ఐదు రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు జమ అవుతోందని, గతంలో 45 రోజులు పెట్టేదన్నారు. రైతు ఎంతో వడ్డీ నష్ట పోయేవాడు. కానీ ఇప్పుడు కేవలం 5 రోజుల్లోనే రైతు ఖాతాల్లో నగదు జమ అవుతుంది దీంతో రైతుకు వడ్డీ వ్యాపారుల వేధింపులు లేవు. వడ్డీలు కట్టాల్సిన అవసరం లేదు. ఆత్మగౌరవంతో ఇప్పుడు రైతు బతుకుతున్నాడని, కేసీఆర్ ప్రభుత్వంలో ఫసల్ బీమా యోజన లేదు. ఉంటే కనీసం పంట నష్టపరిహారం వచ్చేదన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్, రైతు ప్రభుత్వం కాబట్టి పంట నష్టపోయిన రైతాంగానికి పంట నష్టపరిహారాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ అందిస్తోందన్నారు. అంతే గాక, ఇక ముందు ఏ ఒక్క రైతు కూడా ఇలా నష్టపోకుండా, ప్రభుత్వమే రైతుల ప్రీమియం చెల్లించి పంట భీమా పథకాన్ని 3,000 కోట్ల రూపాయలు వెచ్చించి వానాకాలం నుండి అమలు చేస్తున్నామన్నారు. అలాగే తడిచిన ధాన్యాన్ని సైతం ఈ ప్రభుత్వం సేకరిస్తుంది. గతంలో కల్లాల్లో వరికుప్పలమీద రైతులు గుండె పగిలి చనిపోయారు. కానీ మాది రైతు ప్రభుత్వం అని తెలిసి రైతులు గుండె ధైర్యంతో బతుకుతున్నారు. అందుకే మనం దొడ్డు వడ్లు అమ్ముకొనుడెంది, సన్న వడ్లు కొనుక్కునుడేంది.. మనమే మనకు అవసరమైనంత సన్న వడ్లను ఉత్పత్తి చేసుకునేందుకు ఈ బోనస్ పథకాన్ని ప్రవేశపెట్టాము. నాట్లేసుకునే సమయం దగ్గర పడుతుంది కాబట్టి యుద్ధ ప్రాతిపదికన ఈ స్కీమును ప్రవేశపెట్టాం. భవిష్యత్తులో దొడ్డు వడ్లకు కూడా ఈ స్కీములు వర్తింప చేస్తాము. దొడ్డు వడ్లకు

500 రూపాయలు ఇప్పుడు ఇవ్వలేకపోయినా?మూడు నుంచి ఐదు రోజుల్లోనే డబ్బులు చెల్లిస్తూ, మిల్లర్ల ధాన్యం కోతను అరికడుతూ.. ప్రత్యక్షంగా అంతమేరా రైతుకు ఈ ప్రభుత్వం లబ్ది చేకూరుస్తోంది. అది తెలుసు కనుకనే తెలంగాణ రైతులు నిశ్చింతగా ఉన్నారు. రైతులను కాల్చుకుతిన్న టిఆర్ఎస్ అగ్ర నాయకులు ఇప్పుడు రైతుల పేర నాటకాలు ఆడుతున్నారు. సన్న వడ్లకు బోనస్ ఇస్తామని 2020లో కెసిఆర్ ప్రకటించారు. ఆ తర్వాత మూడేళ్లు అధికారంలో ఉన్న నయా పైసా బోనస్ ఇయ్యలేదు అందుకే కేసిఆర్ ను ఓడగొట్టి రైతులు ఇంట్లో కూర్చోబెట్టారు. అన్నదాతలార ఆలోచించండి..ఇది ప్రజా ప్రభుత్వం. ఎక్కడ దుబార చేయకుండా.. కెసిఆర్ అస్తవ్యస్థం చేసిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. త్వరలో అన్ని



హామీలను నిలబెట్టుకుంటాం. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీల అమలు పక్రియను ప్రారంభిస్తామని చెప్పాము. ప్రారంభించి చూపించాం. వచ్చే ఎన్నికల నాటికి అన్ని హామీలను పూర్తి చేసి తీరుతాం. లేకుంటే ఓట్లే అడగం, ఇప్పటికైనా బిఆర్ఎస్ నాయకులు తమ తప్పుడు ప్రకటనలు ఆపుకోవాలని తుమ్మల నాగేశ్వర రావు హితవు పలికారు.


వేగుచుక్క
TELUGU DAILY NEWS
3
23-5-2024

# ధాన్యం కొనుగోళ్లలో ఎందుకీ తిరకాసు



**నిజామాబాద్:** హామీలను నెరవేర్చడంలో రేవంత్ రెడ్డి సర్కార్ విఫలమయ్యిందని బీజేపీ ఎంపి ధర్మపురి అర్వింద్ అన్నారు. ధాన్యం కొనుగోళ్లు, బోనస్ చెల్లింపుల్లో ఇచ్చిన మాట ఎందుకు నిలబెట్టుకోవడం లేదన్నారు. ధాన్యం కొనుగోళ్లపై రైతుల ఆందోళనలను పట్టించుకోవాలని అన్నారు. దేవుళ్లపై ఒట్ల పేరుతో ప్రజలకు కాంగ్రెస్ పంగనామం పెట్టిందని విమర్శించారు. క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఏమైందని ప్రశ్నించారు. వరి పంటకు బోనస్ ఇస్తామని చెప్పి.. ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ సర్కార్ రైతులకు వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. రుణమాఫీ విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని అన్నారు. డిసెంబర్ 9వ తేదీనే రుణమాఫీ చేస్తానని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడేమో ఆగస్టు 15లోగా చేస్తామని అంటున్నారని విమరశించారు. రాష్ట్రంలో 80 శాతం దొడ్డు వడ్లనే పండిస్తారని.. చాలా తక్కువ మంది మాత్రమే సన్న వడ్లు పండిస్తారని ఎంపి తెలిపారు. దొడ్డు వడ్లను కొనుగోలు చేసేందుకు కేంద్రం సిద్దంగా ఉన్నా..సేకరణలో ఎందుకు మడతపేచీలు పడుతున్నారని అన్నారు. దొడ్డు వడ్లను కొనేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. వర్షాలకు ధాన్యం తడిచి మొలకెత్తుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవట్లేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి వారాలు గడుస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఉమ్మడి జిల్లాకు ఎస్ఇ ఒక్కరే.

- మిషన్ భగీరథ ఈఈ రమేష్ వెల్లడి.

**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, మే 22 :**

మిషన్ భగీరథ జిల్లా సూపెరింటెండింగ్ ఇంజనీరుగా కామారెడ్డి లో ఆరేపాక ప్రభాకర్ రావు సోమవారం భాద్యతలు తీసుకున్నట్లు సామాజిక మాధ్యమాలలో వస్తున్న వార్త అవాస్తవమని మిషన్ భగీరథ ఈఈ రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాకు ఒకరే ఎస్.ఈ. ఉంటారని, కార్యాలయం కూడా నిజామాబాద్ లోనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎస్.ఈ. గా రాజేంద్ర కుమార్ పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. కాగా సామాజిక మాధ్యమంలో ఆరేపాక ప్రభాకర్ రావు సిద్ధిపేట జిల్లా మేనేజర్ నుండి ఎస్.ఈ. గా పదోన్నతి పొంది చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ సమక్షంలో భాద్యతలు స్వీకరించారని వార్త చెక్కర్లు కొడుతుందని అన్నారు. కాగా మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీరుగా రామచంద్రం కొనసాగుతున్నారని తెలిపారు. మిషన్ భగీరథ లో మేనేజర్ పదవే లేదని రమేష్ స్పష్టం చేశారు. మిషన్ భగీరథ ద్వారా నల్లాల కనెక్షన్ కోసం పరిశ్రమలు, విద్యా సంస్థలు, రెసిడెన్షియల్ కాలనీలు, ప్రైవేట్ ఆర్గనైజేషన్లు http://missionbhagiratha.telangana.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించారని, ఇది పూర్తిగా అవాస్తవమని ప్రజలు, అధికారులు గమనించాలని రమేష్ కోరారు.

# ప్రభుత్వాసుపత్రుల పనితీరుపై కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష

## వైద్య సేవల పటిష్టత కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చ





**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మే 22**

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు, బోధన్, ఆర్మూర్ హాస్పిటళ్ళ పనితీరుపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో కూలంకషంగా చర్చించారు. స్థానిక జీజీహెచ్ ఆసుపత్రిలో ఆయా విభాగాలను క్షేత్రస్థాయిలో సందర్శించి సమస్యలను పరిశీలించిన జిల్లా పాలనాధికారి, సూపరింటెండెంట్ ఛాంబర్ లో వైద్యాధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష జరిపారు. ఒక్కో విభాగం వారీగా ఆయా ఆసుపత్రులలో నెలకొని ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలను మెరుగుపర్చేందుకు అవసరమైన సదుపాయాలు, వైద్య పరికరాలు, సిబ్బంది కొరత, డాక్టర్ల ఖాళీల భర్తీ గురించి ఆయా విభాగాల అధిపతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆసుపత్రుల్లో రోగులు, వారి వెంట ఉండే అటెండెంట్ల భద్రత కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. జీజీహెచ్ లో ప్రతి రోజు సగటున అవుట్ పేషంట్లు ఎంత మంది వస్తున్నారు, ఆసుపత్రిలో ఇన్ పేషేంట్లుగా చేరుతున్న వారి సంఖ్యకు అనుగుణంగా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా, వివిధ విభాగాల ద్వారా అందిస్తున్న వైద్య సేవలు ఏ విధంగా ఉన్నాయి తదితర అంశాలను సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అనునిత్యం సుమారు 1000 నుండి 2000 మంది వరకు ఓ.పీ నమోదవుతుండగా, ప్రతిరోజూ సగటున 100 నుండి 300 మంది వరకు ఇన్ పేషంట్లు ఆసుపత్రిలో అడ్మిట్ అవుతున్నారని అన్నారు. రాష్ట్రంలోనే మరెక్కడా లేని విధంగా జీజీహెచ్ లో ఉచితంగా కీలు మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామని, 2023 సంవత్సరంలో 83 సర్జరీలు చేశామని తెలిపారు. సిజీరియన్ కాన్పులను 75 శాతం నుండి 35 శాతానికి తగ్గిస్తూ సాధారణ కాన్పులు జరిగేలా కృషి చేస్తున్నామని అన్నారు. అయితే ఆప్తాల్మిక్ వంటి పలు విభాగాలలో వైద్యుల కొరత నెలకొని ఉందని, ఇతర విభాగాల్లోనూ టెక్నీషియన్లు, సిబ్బందిని భర్తీ చేయాల్సిన ఆవశ్యకత ఉందని కలెక్టర్ కు నివేదించారు. ఎం.ఆర్.ఐ, అదనంగా మరో ఐదు ఎక్స్ రే యంత్రాలు అందుబాటులో ఉంటే రోగులకు సత్వరమే మరింత మెరుగైన సేవలు అందించేందుకు వీలవుతుందని తెలిపారు. కాగా,

అందుబాటులో ఉన్న వనరులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. సమీక్ష సమావేశంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

# ఘనంగా లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు.



- పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్.

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, మే 22:**

నగరంలోని 6వ డివిజన్, వినాయక్ నగర్ లో శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో బుధవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ సూర్యనారాయణ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజ, కల్యాణ మహోత్సవ కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, చెడును అంతం చేయడానికి నారాయణుడు వివిధ రూపాలలో జన్మిస్తారనడానికి నిదర్శనం లక్ష్మీనరసింహుడు అని, ప్రత్యక్ష దైవం అని, కలియుగంలో భక్తులు ఆపదలో ఉంటే పిలిస్తే పలికే ఆ స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఇందూర్ ప్రజలపై ఉండాలని అన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, స్వామి వారిని వేడుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు కులచారి సంతోష్, భూమేష్, భాస్కర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మే 22**



: ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ లో సహకార సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం గురించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహిస్తూ తుది దశకు చేర్చారని అన్నారు. ఇదే స్ఫూర్తితో పని చేస్తూ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ జరపాలని అధికారులకు సూచించారు. ఆలస్యంగా పంట దిగుబడులు చేతికి అందిన ప్రాంతాల్లో ఇంకనూ సుమారు 23 చోట్ల కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచడం జరిగిందని, రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి, లారీలలో లోడ్ చేసి ఎప్పటికప్పుడు నిర్దేశిత రైస్ మిల్లులకు పంపించాలని, ఆర్.ఐలను నియమించి మిల్లుల వద్ద ధాన్యం అన్ లోడింగ్ వెంటదివెంట జరిగేలా పర్యవేక్షణ జరపాలన్నారు. అవసరమైతే లారీల సంఖ్యను పెంచాలని, ఇప్పటికే ధాన్యం సేకరణ పూర్తయిన కేంద్రాలలో పని చేసిన హమాలీల సేవలను అవసరమైన కేంద్రాలలో వినియోగించుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీలను పూర్తి చేయాలని, తద్వారా రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరుగుతాయని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, డీఎస్ఓ చంద్రప్రకాశ్, సివిల్ సప్లైస్ డీ.ఎం జగదీశ్, డీసీఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# భాగ్యరెడ్డి వర్మ ఆశయాలు సాధించాలి.



- జిల్లాకలెక్టర్ జితేష్ వి పాటిల్.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మే 22:**

అణగారిన వర్గాలకు మెరుగైన విద్యను అందించి విద్యా విప్లవం సృష్టించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని జిల్లాకలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. డాక్టర్ భాగ్యరెడ్డి వర్మ 136 వ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్ ఆవరణలో ఎస్సి అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా ఏర్పాటు కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళిత బాలికల కోసం పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశారని అన్నారు. సమాజ నిర్మాణానికి అవిరళ కృషిసల్పిన మహానీయుడు భాగ్యరెడ్డి అని అట్టి మహనీయుల జీవిత చరిత్రను బాలబాలికలకు తెలియచెప్పాలని, వారి ఆశయాలకనుగుణంగా ముందుకు సాగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సి అభివృద్ధి అధికారి రజిత, గిరిజనాభివృధికారి అంబాజీ, సిపిఒ రాజారామ్, తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరులో రియల్ వ్యాపారి హత్య

**గుంటూరు:** గుంటూరు జిల్లాలో పట్టపగలు ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. గుంటూరులోని సంజీవయ్య నగర్ మెయిన్ రోడ్ శ్రీనివాస చికెన్ సెంటర్ వద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారి కంచర్ల దేవానందంను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. గత కొంతకాలంగా గుంటూరు నగరానికి దూరంగా జీవన సాగిస్తున్న దేవానందం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్ నెలలో నగరానికి వచ్చాడు. ఈ క్రమంలో దారుణ హత్యకు గురయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు.

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.

**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, మే 22**



రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, రాష్ట్ర రహదారుల ఇంజనీరింగ్ అధికారులు, పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవలసిందిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. . బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఎస్పీ సింధు శర్మతో కలిసి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో మాట్లాడుతూ మానవ తప్పిదాలు, రోడ్డు నిర్మాణంలో కొన్ని లోపాల వల్ల ప్రమాదాలు జరుగుతూ మృత్యువాత పడుతుండడం భాధాకరమన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధలను పాటించేలా చూడాలని అన్నారు. జిల్లాలో జాతీయ రహదారి 60 కిలో మీటర్ల మేర ఉందని, దగ్గి, సదాశివనగర్, బిక్నూర్ టోల్ ప్లాజా, ఆర్టీఏ చెక్ పోస్ట్, టేక్రియాల్ తదితర ప్రాంతాలలో తరచుగా రోడ్డు ప్రమాదాల వల్ల మృత్యువాత పడుతున్నారని అన్నారు. గత సంవత్సరం జిల్లాలో 550 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, ప్రమాదాలకు గల కారణాలను క్షుణ్ణంగా తెలుసుకొని, నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా బ్లాక్ స్పాట్ లను గుర్తించడంతో పాటు స్పీడ్ బ్రేకర్లు, రుంబుల్ స్ట్రిప్స్, బ్యారికేడింగ్, స్టడ్స్ , బ్లింకర్స్, కల్వర్టుల వద్ద రేడియం స్టిక్కర్లు, మలుపుల వద్ద సూచిక బోర్డులు, బాణం గుర్తులు, స్పీడ్ గన్ లు, సి.సి. కెమెరాలు, హైమాక్స్ లైట్లు వంటివి ఏర్పాటు ప్రాంతాలను గుర్తించి తగు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. బై పాస్ రోడ్ నుండి ప్రధాన రహదారి పైకి వచ్చే మార్గంలో స్పీడ్ బ్రేకర్ లు నిర్మించాలని, అత్యవసర సమయంలో వాహనాలు రహదారి ప్రక్కన ఆపడానికి తగు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రమాదం జరిగిన గంట సమయం గోల్డెన్ పీరియడ్ అని, తక్షణ వైద్య సహాయం అందేలా చూడాలని, వెంటిలేటర్ తో అంబులెన్స్ సిద్ధంగా ఉండాలని, ఆసుపత్రిలో అత్యవసరమైన వైద్య పరికరాలు సిద్ధంగా ఉండాలని వైద్యాధికారులకు సూచించారు.

రహదారులపై ప్రమాదాలు జరిగినప్పుడు ప్రతి ఒక్కరు మానవతా దృక్పథంతో బాధితులకు సహాయం చేయాలని, 108 అంబులెన్సు కు కాల్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఎఎస్పీ కాజల్, డిఎస్పీ నాగేశ్వర్ రావు, నేషనల్ హైవే రెసిడెంట్ ఇంజనీర్ రామారావు, టోల్ గేట్ ప్రాజెక్ట్ మేనేజర్ అనిల్ కుమార్, ఆర్ అండ్ బి ఈ ఈ రవిశంకర్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ రామ్ సింగ్, సేవ్ లైఫ్ ఫౌండేషన్ సినియర్ అసోసియేట్ నూర్ ఖేతార్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

# 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే ట్యాంక్‌బండ్‌పై బిసి జనసభ ఆందోళన

**హైదరాబాద్:** స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా ఎన్నికలకు వెళ్తే సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉండాలని బీసీ జనసభ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర బీసీ జనసభ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అడ్డుకోబోయిన పోలీసులతో ఆందోళనకారులు వాగ్వాదానికి దిగారు. దీనితో కాసేపు అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా రాజారాం యాదవ్ మాట్లా డుతూ.. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి విజయభేరీ సభలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేతుల మీదుగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉండాలని అన్నారు. అయితే లోక్‌సభ ఫలితాల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేం దుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారన ఆరోపించారు. కులగణన, సామాజిక న్యాయం పేరుతో అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ది పొందిన కాంగ్రెస్.. మరోసారి బీసీలను మోసం చేసేందుకు సిద్ధమైందని విమర్శించారు. కులగణన చెయ్యకుండా, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వ కుండా ఆగమేఘాల మీద స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఏం ఉందని ప్రశ్నించారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమైతే.. జూన్ 8న ఇందిరాపార్కు దగ్గర వేలాది మందితో మహా ధర్నా కార్యక్రమం చేస్తామని, అప్పుడు కూడా మొండిగా వెళ్ళితే.. జూన్ 15న సెక్రటేరియట్‌ను ముట్టడి చేయనున్నట్టు రాజారాం యాదవ్ ప్రకటించారు.



# రొటీన్‌కు భిన్నంగా శ్రీవిష్ణు ..స్వాగ్



రొటీన్ సినిమాలకు భిన్నంగా తనకంటూ డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ విజయాలను అందుకుంటున్నాడు టాలీవుడ్ హీరో శ్రీ విష్ణు. ఈ హీరో ప్రస్తుతం స్వాగ్ అనే సినిమాతో వస్తున్న విషయం తెలిసిందే. బోరింగ్ కథలకు టాటా చెబుతూ! సరికొత్త పంథాలో అచ్చ తెలుగు సినిమా అంటూ ఇప్పటికే గ్లింప్స్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ నుంచి మరో అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మూవీ నుంచి ఎగ్జైటింగ్ అప్‌డేట్‌లు త్వరలోనే ఇవ్వబోతున్నట్లు చిత్రబృందం ఎక్స్ వేదికగా ప్రకటించింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వ ప్రసాద్ ఈ సినిమాకు నిర్మాతగా వ్యవహారిస్తుండగా.. ఈ సినిమాకు హసిత్ గోలి దర్శకత్వం వహించబోతున్నాడు. వివేక్ సాగర్ సంగీతం అందిస్తుండగా.. వేద రామన్ శంకరన్ సినిమాటోగ్రఫర్ గా వ్యవహరిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో పెళ్లి చూపులు ఫేమ్ రీతూ వర్మ కథానాయికగా నటిస్తుంది. జూలై మొదటి వారంలో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

# అందరూ విమర్శిస్తున్న ఈ నటి ఆస్తులు 53 వేల కోట్లు!



సంజయ్ లీలా భన్సాలీ 'హీరామండి' మే 1న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైంది. అప్పటి నుండి అలంజేబ్ పాత్రను పోషించిన షర్మిన్ సెగల్ నటన పరంగా తీవ్ర విమర్శల్ని ఎదుర్కొంటోంది. అయితే షర్మిన్ సెగల్ అత్యంత ప్రతిభావంతులైన కళాకారుల కుటుంబానికి చెందినదనే విషయం చాలా మందికి తెలియదు. తాజాగా షర్మిన్ సెగల్ వ్యక్తిగత జీవితం కుటుంబం గురించి తెలుసుకుంటే షాకిచ్చే వివరాలు తెలిసాయి. షర్మిన్ సెగల్ వివాహిత. తన భర్త అమన్ మెహతా నికర ఆస్తుల విలువ రూ. 53,800 కోట్లు. అతడు బిజినెస్ మ్యాగ్నెట్. 1995లో జన్మించిన షర్మిన్ సెగల్ ఫిల్మ్ ఎగ్జిక్యూటివ్ దీపక్ సెగల్ .. ఫిల్మ్ ఎడిటర్ బేలా సెగల్ కుమార్తె. షర్మిన్ సెగల్ తల్లి సంజయ్ లీలా భన్సాలీకి చెల్లెలు. భన్సాలీకి షర్మిన్ మేనకోడలు. షర్మిన్ తండ్రి తరపు తాత మోహన్ సెగల్ కూడా చిత్ర దర్శకుడిగా 40 ఏళ్ల కెరీర్‌ను కలిగి ఉన్నారు. అమితాబ్ బచ్చన్, ధర్మేంద్ర, హేమ మాలిని, రేఖ, అశోక్ కుమార్, వైజంతిమాల, శశి కపూర్, మనోజ్ కుమార్ వంటి అగ్ర తారలతో సినిమాలు తీశాడు.షర్మిన్ సెగల్ నవంబర్ 2023 నుండి టోరెంట్ గ్రూప్ విభాగమైన టోరెంట్ ఫార్మాస్యూటికల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమన్ మెహతాను వివాహం చేసుకున్నారు. అమన్ మెహతా బిలియనీర్ వ్యాపార దిగ్గజం సమీర్ మెహతా కుమారుడు. అతడు తన సోదరుడు సుధీర్ మెహతాతో కలిసి టోరెంట్ గ్రూప్‌కు నాయకత్వం వహిస్తున్నాడు. ఇది టోరెంట్ ఫార్మా, టొరెంట్ పవర్, టొరెంట్ కేబుల్స్, టొరెంట్ గ్యాస్ అండ్ టొరెంట్ డయాగ్నోస్టిక్స్‌తో కూడిన భారీ వ్యాపార సామ్రాజ్యం. అమన్ మెహతా కొలంబియా బిజినెస్ స్కూల్‌లో షర్మిన్ సెగల్ విషయానికొస్తే.. 18 సంవత్సరాల వయస్సులో సంజయ్ లీలా భన్సాలీకి 'గోలియోన్ కి రాస్లీలా రామ్-లీలా' సెట్స్ లో అసిస్టెంట్ గా సహాయం చేయడం ద్వారా చలనచిత్ర ప్రపంచంలోకి ప్రవేశించింది. 2019 చిత్రం 'మలాల్'లో కథానాయికగా ఆరంగేట్రం చేసింది. 'హీరామండి' షర్మిన్ కి మొదటి %ాఋ% సిరీస్. ఇకపైనా నటనారంగంలో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది.



# అనుష్కతో సినిమా తీస్తా

అనుష్క ప్రధాన పాత్రల్లో ఓ సినిమాకు సన్నాహాలు చేస్తున్నట్లు నిర్మాత ఎస్ కే బషీద్ తెలిపారు. 2007లో అల్లరి నరేష్, వేణు హీరోలుగా 'అల్లరే అల్లరి' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలో నిర్మాతగా తన ప్రస్థానం మొదలుపెట్టిన ఎస్ కే బషీద్.. ఆ తర్వాత పలు చిత్రాలను నిర్మించారు. తన కొత్త సినిమా విశేషాలను తాజాగా హైదరాబాద్ ఫిలించాంబర్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన చెప్పు కొచ్చారు. అల్లరే అల్లరి సినిమాతో నిర్మాతగా చిత్ర పరిశ్రమకు వచ్చాను. వ్యాపారవేత్తగా, నిర్మాతగా కొనసాగుతున్నాను. దర్శకుడు సురేష్ కృష్ణ దర్శకత్వంలో విజయేందప్రసాద్ కథతో అనుష్క, విజయశాంతి ప్రధాన పాత్రల్లో ఓ సినిమాకు సన్నాహాలు చేసుకుంటున్నాను. ఇంకా వారితో నేరుగా సంప్రదింపులు జరపలేదు. డిస్కషన్స్ చేయబోతున్నాం. ఈ మూవీకి ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తారు. ఒక పాట కంపోజిషన్ జరుగుతోంది. ఆ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే తెలియజేస్తానన్నారు.



# ఓటిటిలోకి అజయ్ దేవగణ్ ..మైదాన్



బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం మైదాన్ . ఇండియన్ లెజెండరీ ఫుట్‌బాల్ కోచ్ అబ్దుల్ రహీమ్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఈ సినిమాకు అమిత్ రవీంద్రనాథ్ శర్మ దర్శకత్వం వహించాడు.. జీ స్టూడియోస్ సంస్థ, బోనికపూర్ నిర్మాతలుగా వ్యవహరించారు. ఈ సినిమా అనుకోని కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తూ.. ఎట్టకేలకు ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద యావరేజ్‌గా నిలిచింది. ఇప్పుడు తాజాగా ఈ చిత్రం ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో ఈ సినిమా ప్రస్తుతం రెంటల్ విధానంలో అందుబాటులోకి వచ్చింది. రూ.349కి ఈ సినిమాను ప్రైమ్ అందుబాటులో ఉంచింది. 1950-62 మధ్యకాలంలో ఫుట్‌బాల్ ఆటకు ఇండియాలో విపరీతమైన క్రేజ్ ఉండేది. అయితే ఫుట్‌బాల్ ఆటకు ఇంత ఆదరణ రావడానికి కారణం ఫుట్‌బాల్ కోచ్ అబ్దుల్ రహీమ. అతను కోచ్‌గా ఉన్నప్పుడే 1951, 1962లో భారత ఫుట్ బాల్ టీమ్ ఆసియా గేమ్స్ లో విజయం సాధించింది. ఇక అబ్దుల్ రహీమ్ కోచ్‌గా ఉన్నప్పుడు జరిగిన సంఘటనల ఆధారంగా ఈ సినిమా రాగా.. అబ్దుల్ రహీమ్ పాత్రలో అజయ్ దేవగణ్ నటించగా.. అతడి భార్య పాత్రలో ప్రియమణి నటించింది. ఇక ఈ సినిమాలో గజ్రాజ్ రావ్. రుద్రానిల్ ఘోష్ కీలక పాత్రలు పోషించారు.

# పుష్ప 2.. శ్రీవల్లి టైమొచ్చింది!

ఇండియన్ సినిమా రంగంలో అత్యంత ఆసక్తికరంగా ఎదురు చూస్తున్న ప్రాజెక్టులలో "పుష్ప 2" ఒకటి. ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో, సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం, మొదటి భాగం "పుష్ప: ది రైజ్" సాధించిన విజయం తరువాత మరింత ఆసక్తిని రేకెత్తించింది. ఈ చిత్ర షూటింగ్ ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో వేగంగా జరుగుతోంది.సుకుమార్ టీమ్ అనుకున్న సమయానికి చిత్రాన్ని విడుదల చేసేందుకు కృషి చేస్తోంది. "పుష్ప 2" పాన్ ఇండియా స్థాయిలో ఆగస్టు 15న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ డేట్ కోసం చిత్రబృందం పగలు, రాత్రి అని తేడా లేకుండా పని చేస్తోంది. ఇక ఇప్పటికే ప్రేక్షకులలో ఆసక్తిని మరింత పెంచేందుకు "పుష్ప 2" టైటిల్ సాంగ్ విడుదలైంది. ఈ పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చింది.ఇప్పుడు మరో పాటను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నారు. మే 23న ఉదయం 11 గంటల 7 నిమిషాలకు ఈ సాంగ్ విడుదల కానుంది. రష్మిక, అల్లు అర్జున్ జంటగా ఉన్న ఈ పాట కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో మొత్తంగా 5 పాటలు ఉండబోతున్నట్ల సమాచారం. ఇక సెకండ్ సాంగ్ లో పుష్ప శ్రీవల్లి కెమిస్ట్రీ మరింత హైలెట్ అయ్యే విధంగా ఉంటుందట. పార్ట్ 1లో శ్రీవల్లి సాంగ్ కూడా బాగా ట్రెండ్ అయ్యింది. ఇక ఇప్పుడు అంతకుమించి ఉండేలా దేవి కంపోజింగ్ ఉండబోతున్నట్లు సమాచారం. సుకుమార్ దేవిశ్రీప్రసాద్ కాంబినేషన్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇక అల్లు అర్జున్ తో ఈ కాంబో పడితే మ్యూజిక్ విషయంలో అస్సలు తేడా రాదు. అంతేకాక, "పుష్ప 2" లో ఒక ఐటెమ్ సాంగ్ ఉండబోతుందని సమాచారం. ఈ సాంగ్ కోసం పలు ప్రముఖ కథానాయికల పేర్లు పరిశీలనలో ఉన్నాయి.జాన్వీ కపూర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అయితే, ఇందులో ఎవరిని తీసుకుంటారో స్పష్టత త్వరలోనే రానుంది. ఇక ఈ భారీ ప్రాజెక్ట్ నిర్మాణం విషయంలో మైత్రి మూవీ మేకర్స్ ఏమాత్రం రాజీ పడడం లేదు. మొదటి భాగం "పుష్ప: ది రైజ్" మంచి విజయాన్ని సాధించిన తరువాత, "పుష్ప 2" పై అంచనాలు మరింత పెరిగాయి.

# చీరకట్టులో జాన్వీ అదుర్స్



బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ స్టన్నింగ్ లుక్‌లో దర్శనమిచ్చారు. కంచి పట్టు చీర కట్టిన ఆ ముద్దుగుమ్మ.. తన అందాలతో ఆకర్షిస్తోంది. బ్లూ కలర్ శారీ కట్టుకున్న జాన్వీ.. ఆ పట్టు చీరపై క్రికెట్ డిజైన్ వేసుకున్నది. మిస్టర్ అండ్ మిస్సెస్ మహీ ఫిల్మ్ కోసం వారణాసిలో ప్రమోషన్ చేస్తున్న ధడక్ గర్ల్.. చాలా వెరైటీ శారీలో తళుక్కుమన్నది. గంగా నది తీరంలో పడవపై వెళ్తూ ఆమె తన చీరలో దాగిన డిజైన్ వర్క్‌ను ప్రజెంట్ చేసింది. బ్లూ కలర్ చీరపై చేయితో నేసిన డిజైన్ వర్క్ ఆకట్టుకంటోంది. 1983 వరల్డ్ కప్ గెలిచిన సందర్భానికి చెందిన క్షణాలను ఆ చీరపై అత్యంత కళాత్మకంగా డిజైన్ చేశారు. మిరుమిట్లు గొలిపే స్టేడియంలో ఓ బ్యాటర్ భారీ సిక్స్ కొట్టినట్లు ఆ చీర డిజైన్‌లో చూపించారు. క్రికెటర్లు పవర్‌ఫుల్ షాట్లు ఆడుతున్నట్లు కూడా డిజైన్‌లో క్రియేట్ చేశారు. షార్ట్ స్లీవ్ బ్లౌజ్ వేసుకున్న జాన్వీ.. బ్యాక్‌లెస్ టై నాట్‌తో సంప్రదాయబద్ధంగా కనిపించింది. క్రికెట్ స్టోరీ నేపథ్యం ఉన్న చిత్రంలో నటిస్తున నజాన్వీ.. ఆ కాన్సెప్ట్‌తో డిజైన్ చేసిన చీరలో తన ఫ్యాషన్ ట్యాలెంట్‌ను ప్రదర్శించింది.